@netifocusnews @focustv
www.netifocusnews.com
http://epaper.netifocusnews.com
TS-18-0006625

FOCUS TELUGU TV
అనునిత్యం - ప్రజాపక్షం

# నేటి ఫోకస్ న్యూస్

అను నిత్యం...ప్రజా పక్షం...

తెలుగు డిజిటల్ దినపత్రిక

ఎడిటర్: యం.తరుణ్ | తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం మా ఈ నేటి ఫోకస్ న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రిక || హైదరాబాద్ || శనివారం 01, జూన్ 2024 || పేజీలు: 04




## నిప్పుల కొలిమి

- దేశవ్యాప్తంగా మండుతున్న ఎండలు
- నాగ్‌పుర్‌లో అత్యధికంగా 56 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- వడదెబ్బకు ఒకేరోజు 54మంది మృతి

నేటి ఫోకస్ న్యూస్, నాగ్‌పుర్-మే31:

దేశవ్యాప్తంగా ఎండలు మండుతున్నాయి. రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలతో సూర్యుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. మొన్నటికి మొన్న దేశ రాజధాని దిల్లీలో అత్యధికంగా 52.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైన సంగతి తెలిసిందే. ఆ ఉష్ణోగ్రతను దాటి ఇప్పుడు మహారాష్ట్రలోని నాగ్‌పుర్‌లో ఏకంగా 56డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నాగ్‌పుర్‌లో భారత వాతావరణ విభాగం 4ఆటోమేటిక్ వెదర్ స్టేషన్స్‌ను ఏర్పాటుచేసింది. ఇందులో రెండింట గురువారం అసాధారణ ఉష్ణోగ్రతలు చూపించాయి. సోనేగావ్‌లోని ఏడబ్ల్యూఎస్ స్టేషన్‌లో 54 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవగా.. ఉత్తర అంబాజరీ రోడ్డులోని మిగతా 2లో..



## ఇంగ్లండ్ నుంచి లక్ష కిలోల బంగారం

- భారీ భద్రత నడుమ ప్రత్యేక విమానంలో ఆర్బీఐ ఖజానాకు..
- నిల్వ సర్దుబాట్లలో భాగంగానే భారత్‌కు ఈ స్థాయిలో తరలింపు
- 15 ఏళ్ల క్రితం ఐఎంఎఫ్ నుంచి ఆర్బీఐ 200 టన్నుల కొనుగోలు
- కొన్నేళ్లుగా బంగారాన్ని కొంటూ బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్‌లో నిల్వ
- విదేశీ మారక నిల్వల సంక్షోభంతో 1991లో బంగారం తనఖా
- ఇప్పుడు 100 టన్నులను దించడం దేశ ఆర్థికశక్తికి నిదర్శనం: ఆర్బీఐ

నేటి ఫోకస్ న్యూస్, ముంబై, మే 31:

వంద టన్నుల బంగారం.. అంటే.. లక్ష కిలోలు! ఇంత భారీ స్థాయిలో బంగారం ఇంగ్లండ్ నుంచి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఖజానాకు చేరింది. 1991 తర్వాత ఇంత పెద్ద మొత్తంలో దేశానికి బంగారాన్ని తరలించడం ఇదే తొలిసారి. మరి.. ఇంత బంగారం ఎక్కడిది? చాలా దేశాల్లోని కేంద్ర బ్యాంకులు బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్‌లో తమ బంగారాన్ని నిల్వ చేస్తుంటాయి. భారత్ ఇదే చేసింది. 15 ఏళ్ల క్రితం అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) నుంచి 200 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేసింది. పైగా కొన్నేళ్లుగా పెద్ద ఎత్తున పుత్తడిని కొనుగోలు చేస్తూ వచ్చిన ఆర్బీఐ, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్‌లో నిల్వచేస్తూ వస్తోంది. 2024 మార్చి నాటికి ఆర్బీఐ వద్ద 822.1 టన్నుల బంగారం ఉంది. ఇందులో 413.8 టన్నులు ఇతర దేశాల్లో నిల్వ చేసి ఉంచింది. 2023లో 27.5 టన్నుల పసిడిని కొత్తగా నిల్వలో చేర్చింది. ఈ ఏడాది జనవరి-ఏప్రిల్ వ్యవధిలోనే నిరుడు కంటే ఒకటిన్నర రెట్లు అధిక బంగారాన్ని కొనుగోలు చేసింది. కాగా ఇంగ్లండ్ నుంచి 100 టన్నుల బంగారాన్ని తరలించేందుకు ప్రత్యేకంగా కొన్నినెలల పాటు కసరత్తు చేసి భారీ భద్రత నడుమ ప్రత్యేక విమానంలో భారత్‌కు తరలించారు. మిగతా 2లో..

## నేటి సాయంత్రం 6.30 తరవాతే ఎగ్జిట్ పోల్స్

- కీలక ఆదేశాలు జారీ చేసిన ఎన్నికల సంఘం

నేటి ఫోకస్ న్యూస్, న్యూఢిల్లీ-మే31:

దేశవ్యాప్తంగా శనివారం వెలువడబోయే ఎగ్జిట్ పోల్స్ అంచనాలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఈ తరుణంలో శుక్రవారం సాయంత్రం కేంద్ర ఎన్నికల సంఘం మిగతా 2లో..




వివరాలు 03లో..

## నిరుద్యోగులకు ఆర్టీసీ బంపరాఫర్

- ఐటిఐల్లో శిక్షణ.. ఆ తరవాత ఉద్యోగాలు

నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-మే31:

పెద్దగా చదువు లేకపోవడంతో నిరుద్యోగంతో నానా అవస్థలు పడుతున్న వారి కోసం తాజాగా తెలంగాణ ఆర్టీసీ గుడ్‌న్యూస్ తెలిపింది. ఈ సందర్భంగా తెలంగాణ ఆర్టీసీ ఎండి సజ్జనార్ కీలక ప్రకటనను చేశారు. మిగతా 2లో..

## నేడు తెలంగాణ పర్యటనకు ప్రియాంక గాంధీ

నేటి ఫోకస్ న్యూస్, రంగారెడ్డి:

ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం కాంగ్రెస్ అగ్ర నాయకురాలు ప్రియాంక గాంధీతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాండూర్, కామారెడ్డిలలో పర్యటించనున్నారు. ఈరోజు ఉదయం 10 గంటలకు పఠాన్‌చెరు కార్నర్ మీటింగ్‌లో పాల్గొననున్నారు. మధ్యాహ్నం 1 గంటకు తాండూర్ జన జాతర సభకు ప్రియాంక గాంధీ, రేవంత్ రెడ్డి హాజరవుతారు. సాయంత్రం 3.15 గంటలకు ప్రియాంక గాంధీతో కలిసి కామారెడ్డిలో రోడ్ షోలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొననున్నారు. కాగా హెూరాహెూరీగా సాగిన లోక్‌సభ ఎన్నికల మిగతా 2లో..





## ట్యాపింగ్ కేసు సీబీఐకి ఇవ్వాలి

- రేవంత్‌కు పౌరుషముంటే కేసీఆర్‌పై చర్యలు తీసుకోవాలి
- ఇందిరా పార్కు వద్ద బీజేపీ ధర్నాలో ఎంపీ లక్ష్మణ్

2

## విత్తన గోదాముల్లో తనిఖీలు

నేటి ఫోకస్ న్యూస్, ఆదిలాబాద్-మే31:

విత్తన గోదాముల్లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్ఠ చర్యలు చేపట్టామని ఎస్పీ గౌష్ ఆలం పేర్కొన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలోని విత్తన, ఎరువుల గోదాములను వ్యవసాయ శాఖ అధికారులు, డీఎస్పీ జీవన్ రెడ్డితో కలిసి ఎస్పీ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఉన్న విత్తన గోదాముల్లో విస్తృతంగా తనిఖీలు చేస్తున్నట్లు చెప్పారు. ఎవరు బ్లాక్ చేసినా కఠిన చర్యలు తప్పవని మిగతా 2లో..




## 7, 8 తేదీల్లో హైదరాబాద్‌లో ప్రపంచ వరి సదస్సు

- విదేశీ శాస్త్రవేత్తల రాక: మంత్రి తుమ్మల

నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్, మే 31:

ఈ నెల 7, 8 తేదీల్లో హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణ హెూటల్‌లో ప్రపంచ వరి సదస్సును నిర్వహిస్తున్నట్లు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను మంత్రికి అంతర్జాతీయ మిగతా 2లో..



## నేడు చివరి దశ లోక్‌సభ ఎన్నికలు

- 7రాష్ట్రాల్లో 57స్థానాలకు..
- వారణాసి నుంచి ప్రధాని మోడీ పోటీ
- హిమచల్ నుంచి నటి కంగనా రనౌత్

నేటి ఫోకస్ న్యూస్, న్యూఢిల్లీ-మే31:

లోక్‌సభ తుదిదశ ఎన్నికలు శనివారం జరుగనున్నాయి. దాదాపు 904 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వారిలో ప్రధాని నరేంద్ర మోడీ కూడా ఉన్నారు. వారణాసి నుంచి మూడోసారి పోటీ చేస్తున్నారు. కేంద్ర పాలిత ప్రాంతమైన చండీగఢ్ సహా ఏడు రాష్ట్రాల్లో 57 స్థానాలకు ఈ ఏడో దశ ఎన్నికలు జరుగనున్నాయి. ప్రధాని నరేంద్ర మోడీ మూడో సారి వారణాసి నుంచి పోటీ చేస్తున్నారు. మిగతా 2లో..





## హామీలన్నీ నెరవేర్చే బాధ్యత నాదే

- మంత్రి పొంగులేటి హామీ

నేటి ఫోకస్ న్యూస్, ఖమ్మం-మే31:

ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ ప్రణాళిక ప్రకారం నెరవేరుస్తానని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. పేదలకు ఇళ్లు, రేషన్ కార్డులతో సహా ఈ ప్రాంత సాగునీటికి కృషి చేస్తానని అన్నారు. పాలేరు నియోజకవర్గ సర్వతో ముఖాభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. మిగతా 2లో..

నేటి ఫోకస్ న్యూస్
అను నిత్యం...ప్రజా పక్షం...
శనివారం 01, జూన్ 2024

# ట్యాపింగ్ కేసు సీబీఐకి ఇవ్వాలి

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-మే 31:**

ఫోన్ ట్యాపింగ్ వల్లే తాను జైలుకు వెళ్లాల్సి వచ్చిందని పదే పదే చెప్పిన సీఎం రేవంత్‌కు ఏ మాత్రం పౌరుషం ఉన్నా మాజీ సీఎం కేసీఆర్‌పై చర్యలు తీసుకోవాలని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్ సవాల్ చేశారు. ఈ కేసులో కేసీఆర్, హరీశ్ రావుల పాత్రను జైల్లో ఉన్న పోలీసు అధికారులు తమ వాంగ్మూలంలో బట్టబయలు చేసినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఇందిరాపార్కు వద్ద బీజేపీ నిర్వహించిన ధర్నాలో లక్ష్మణ్ మాట్లాడారు. "మీ అధినాయకత్వం నుంచి ఒత్తిడి ఉందా..? లేక మీ నాయకత్వం కేసీఆర్‌తో లోపాయికారీ ఒప్పందం చేసుకుందా..? కేసీఆర్‌పై చర్య తీసుకోకపోవడానికి కారణమేంటి..? ప్రజలకు రేవంత్ సమాధానం చెప్పాలి" అని లక్ష్మణ్ డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందని, దానిని కక్కిస్తామని ఎన్నికల ముందు చెప్పిన రేవంత్.. ఇప్పుడు ఎందుకు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారో సమాధానం చెప్పాలని నిలదీశారు. ఫోన్ ట్యాపింగ్‌తో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంత దిగజారుడు రాజకీయాలకు పాల్పడిందో జైల్లో ఉన్న పోలీసు అధికారుల నేరాంగీకార పత్రాలను పరిశీలిస్తే అర్థమవుతోందని లక్ష్మణ్ అన్నారు. ఫోన్ ట్యాపింగ్‌తో వ్యాపారులను హింసించి డబ్బులు వసూలుచేశారని మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఫోన్ ట్యాపింగ్ సూత్రధారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, బీఎల్ సంతోష్‌పై పెట్టిన కేసులను పరిశీలించాలని మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ డిమాండ్ చేశారు.

# నిప్పుల కొలిమి..

(మొదటి పేజీ తరువాయి..)

ఐఎండీ కేంద్రంలో రికార్డు స్థాయిలో 56 డిగ్రీలు నమోదైంది. మిగతా రెండు స్టేషన్లలో 44 డిగ్రీల ఎండలు ఉన్నట్లు రికార్డయ్యింది. ఇటీవల ఢిల్లీలోని ముంగేష్‌పుర్‌లో 52.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైన సంగతి తెలిసిందే. ఢిల్లీ చరిత్రలో ఇదే అత్యధికం కావడంతో వాతావరణ శాఖ స్పందిందించి. ఆ వాతావరణ స్టేషన్‌లోని సెన్సార్ సరిగా పనిచేస్తుందో, లేదో తనిఖీ చేస్తున్నట్లు తెలిపింది. ఈ పరిణామాల వేళ ఇప్పుడు నాగ్‌పుర్‌లో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవడం మరోసారి చర్చకు దారితీసింది. ఇక్కడా సెన్సార్ పనితీరుపై అనుమానాలు వ్యక్తమవుతు న్నాయి. అయితే దీనిపై అధికారులు స్పందించాల్సి ఉంది. మరోవైపు తీవ్ర మైన ఎండలు, వడగాలులతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఇప్పటికే వడదెబ్బ కారణంగా దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో 54 మంది ప్రాణాలు కోల్పోయారు. అత్యధికంగా బిహార్‌లో 32 మంది మృతి చెందగా.. ఒడిశాలో 10, ఝార్ఖండ్‌లో 5, రాజస్థాన్‌లో ఐదుగురు, ఉత్తరప్రదేశ్‌లో ఒకరు, ఢిల్లీలో ఒకరు మరణించారు. రానున్న రెండు రోజుల్లో యూపీ, ఢిల్లీ, చండీగఢ్, హరియాణాలోని పలు ప్రాంతాల్లో దుమ్ము తుపాను వచ్చే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. వడగాలులు తీవ్రంగా ఉన్నందున దేశంలో జాతీయ ఎమ్జర్గ÷న్సీని విధించే అవకాశాలను పరిశీలించాలని రాజస్థాన్ హైకోర్టు కేంద్రానికి సూచించింది. మరోవైపు, దేశంలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించడం కాస్త ఊరట నిచ్చే విషయం. గురువారం కేరళ తీరాన్ని తాకిన ఈ రుతుపవనాలు.. ప్రస్తుతం దక్షిణాది, ఈశాన్య రాష్ట్రాల్లో విస్తరిస్తున్నాయి. దీంతో పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. రానున్న రోజుల్లో ఇవి మిగతా ప్రాంతాలకు విస్తరించే అవకాశముంది. దీంతో శనివారం నుంచి వడగాలుల తీవ్రత కాస్త తగ్గొచ్చని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది.

## నేటి సాయంత్రం 6.30తరవాతే

# ఎగ్జిట్ పోల్స్..

(మొదటి పేజీ తరువాయి..)




కీలక ఆదేశాలు జారీ చేసింది. నేటితో లోక్‌సభ ఎన్నికల చివరిదశ పోలింగ్ ముగియనుంది. దీంతో శనివారం సాయంత్రం ఎగ్జిట్ పోల్స్ వెలువడాల్సి ఉంది. అయితే.. నిర్ణీత సమయం కంటే ముందు ఫలితాలను ఇవ్వకూడదని ఈసీ తాజాగా ఆదేశాలు విడుదల చేసింది. జూన్ 1వ తేదీ శనివారం సాయంత్రం 6:30 తరువాతే ఎగ్జిట్ పోల్స్ విడుదల చేయాలని తెలిపింది. ప్రజా ప్రాతినిధ్య చట్టం సెక్షన్ 126ఏ(1) ప్రకారం నిబంధనలు పాటించాల్సిందేనని తాజా ఆదేశాల్లో ఈసీ పేర్కొంది. లోక్‌సభ ఎన్నికలతో పాటు ఒడిషా, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు,అలాగే దేశవ్యాప్తంగా 12 రాష్ట్రాల్లోని 25 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఉప ఎన్నికలు జరిగాయి. అయితే వీటన్నింటికి ఎగ్జిట్ పోల్స్ ఫలితాలను ఈసీ బ్యాన్ చేసింది. పూర్తి స్థాయిలో అంతటా పోలింగ్ ముగిసిన తర్వాతే వెల్లడించాలని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్లకు మార్చి 28వ తేదీ జారీ చేసిన నోటిఫికేషన్‌లో ఈసీ స్పష్టంగా పేర్కొంది.

## నిరుద్యోగులకు ఆర్టీసీ

# బంపరాఫర్

(మొదటి పేజీ తరువాయి..)

హైదరాబాద్, వరంగల్ నగరాలలో ఆర్టీసీ సంస్థ ఐటిఐ కాలేజీలలో యువతకు వివిధ ట్రేడ్లలో శిక్షణ ఇస్తూ వారికి ఉపాధి అవకాశాలను చూపుతోంది. ఈ నేపథ్యంలోనే తాజాగా మెకానిక్ డీజిల్, వెల్డర్, మోటార్ మెకానిక్ వెహికల్, పెయింటర్ లాంటి వివిధ ట్రేడులలో ప్రవేశం కల్పించబోతున్నారు. ఈ కాలేజీలో ప్రవేశం కోసం జూన్ 10 చివరి తేదీ కానుంది. అంతలోపు దరఖాస్తు చేసుకున్న వారికి తెలంగాణ ఆర్టీసీ ఐటిఐ కాలేజ్లలో శిక్షణ పొందే అవకాశాన్ని కల్పించడం జరుగుతుంది. ఈ ట్రేడ్స్ లో చేరేందుకు అర్హత ఉన్నవారికి ప్రవేశం కల్పిస్తోంది టీజీఎస్ఆర్టీసీ. ఇక శిక్షణ కొరకు వెబ్ సైట్ ను ఉపయోగించి అప్లికేషన్ పెట్టాలి. ఈ కోర్సులలో మోటార్ మెకానిక్ వెహికల్ రెండు సంవత్సరాల వ్యవధి, మెకానిక్ డీజిల్ ఏడాది శిక్షణను కలిగి ఉంటుంది. ఈ రెండు ట్రేడ్స్ చదవాలన్నవారు కచ్చితంగా పదవ తరగతి పాసై ఉండాలి. అలాగే పెయింటింగ్ శిక్షణకు రెండు సంవత్సరాలు, వెల్డింగ్ అయితే ఏడాదికాలం శిక్షణను కలిగి ఉంటుంది. వీటికి కేవలం ఎనిమిదో తరగతి పాస్ అయితే చాలు. ఇందులో కేవలం కొన్ని పరిమిత సీట్లు మాత్రమే ఉంటాయి కాబట్టి అర్హులైన వారు వీటికి దరఖాస్తు తొందరగా చేసుకుంటే మేలు. వీరు శిక్షణ పూర్తి కాగానే ఆర్టీసీలోనే ఉద్యోగాలు పొందుతున్నారు.

## నేడు తెలంగాణ పర్యటనకు

# ప్రియాంక గాంధీ

(మొదటి పేజీ తరువాయి..)

ప్రచారం చివరి దశకు చేరింది. శనివారం సాయంత్రంతో ప్రచార గడువు ముగియనుంది. ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు, వారి తరపున స్టార్ క్యాంపెయినర్లు ప్రచారాన్ని హోరెత్తించారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఓటర్లకు చేరువయ్యేందుకే అన్ని పార్టీల నాయకులు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. బహిరంగ సభలను తగ్గించిన పార్టీలు కార్నర్ మీటింగ్‌లు, రోడ్‌షోల ద్వారా ప్రచారాన్ని హోరెత్తించాయి. స్టార్ క్యాంపెయినర్లు సైతం సమ్మేళనాలు, రోడ్‌షోలకే ప్రాధాన్యమిచ్చి ప్రచారం నిర్వహించడం ఈసారి మారిన సరళికి నిదర్శనం. వీటికి తోడు పార్టీల మ్యానిఫెస్టోలు, నినాదాలు, లోకల్ మ్యానిఫెస్టోలతో పాటు ప్రధాని మొదలు సీఎం, మాజీ సీఎం, ఆయా పార్టీల స్టార్ క్యాంపెయినర్ల సంభాషణల వీడియోలను సోషల్‌మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేయించారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్, వాట్సప్ గ్రూప్‌ల ద్వారా తమ వాణిని అభ్యర్థులు విస్తృతంగా ఓటర్ల దరికి చేర్చారు. ఓటర్లను అభ్యర్థిస్తూ వాయిస్ మెసేజెస్ ముంచెత్తాయి.

# అట్టహాసంగా దశాబ్ది వేడుకల ఏర్పాట్లు

- ట్యాంక్‌బండ్, పరేడ్ గ్రౌండ్స్‌లో ముమ్మరంగా పనులు
- నేటి సాయంత్రమే ట్యాంక్‌బండ్‌పై ఫుడ్ కోర్టులు
- అధికారులతో కసలి ఏర్పాట్లను పరిశీలించిన సిఎస్

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-మే31:**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ట్యాంక్‌బండ్‌తో పాటు సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. జూన్2వ తేదీన రాష్ట్ర దశాబ్ది వేడుకలను వైభవంగా నిర్వహిం చేందుకు తెలంగాణ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. ఉదయం, సాయంత్రం ఈ వేడుకలను ఘ నంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే పోలీసులు రిహార్సల్స్ కూడా చేశారు. ముఖ్య అతిథులు, ప్రజాప్రతినిధులు, ఆహ్వానితులకు ప్రత్యేక లాంజ్ ఏర్పాటు చేశారు. రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను అట్టహాసంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని సీఎస్ శాంతి కుమారి అన్నారు. శుక్రవారం సీఎస్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ..జూన్ 1వ తేదీ సాయంత్రం నుంచే ట్యాంక్ బండ్ పై స్టాళ్లను ఏర్పాటు చేస్తామని అన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. జూన్2న రాత్రి 11 వరకు ఉత్సవాలు కొనసాగుతాయని చెప్పారు. 2వ తేదీ సాయంత్రం ఏడు గంటలకు ట్యాంక్ బండ్ పై వెలుగులు విరజిమ్మే క్రాకర్స్, పటాకులు కాల్చుతారని, కార్నివాల్ ఏర్పాటు చేయబోతున్నామని చెప్పారు. ఈ క్రమంలో పరేడ్ గ్రౌండ్ మొత్తం డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్‌లతో ముమ్మర తనిఖీలు చేశారు. ఈ వేడుకల ఏర్పాట్లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, కలెక్టర్ అనుదీప్, పోలీస్ ఉన్నతాధికారులు పరిశీలించారు. ఆవిర్భావ వేడుకలకు భారీ ఏర్పాట్లు చేస్తున్నామని సీఎస్ శాంతి కుమారి తెలిపారు. జూన్2న ఉదయం 10 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని సీఎస్ చెప్పారు. ట్యాంక్‌బండ్‌పై 5వేల మందితో లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నామని ప్రజలంతా ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొనాలని సీఎస్ కోరారు. శనివారం సాయంత్రం 5 గంట నుంచి ప్రజలను ట్యాంక్ బండ్‌కు అనుమతిస్తారని తెలిపారు. వేడుకలకు భారీగా ఏర్పాట్లు చేశామని, ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఫైర్‌వర్క్స్, కార్నివాల్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కొత్తగా నియామక పత్రాలు తీసుకున్న వారితో ఓ కార్యక్రమానికి ప్లాన్ చేసినట్లు సీఎస్ శాంతి కుమారి తెలిపారు.

# జూనియర్ కాలేజీలకు ముగిసిన సెలవులు

**- నేటి నుంచి ఇంటర్ తరగతులు పునఃప్రారంభం**

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-మే31:**

వేసవి సెలవులు ముగియడంతో జూన్ 1 నుంచి జూనియర్ కాలేజీలు ప్రారంభం కానున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో 2024-25 విద్యాసంవత్సరానికి గాను జూన్ 1 నుంచి ఇంటర్ తరగతులు పునఃప్రారంభం కానున్నాయి. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యా మండలి వార్షిక అకడమిక్ క్యాలెండర్‌ను విడుదల చేసింది. వేసవి సెలవుల నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీలకు మార్చి 31 నుంచి సెలవులు ప్రకటించిన సంగతి తెలిసిందే. మే 31తో సెలవులు ముగియనున్నాయి. దీంతో శనివారం నుంచి జూనియర్ కాలేజీల్లో ఇంటర్ ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్ విద్యార్థులకు తరగతులు పునఃప్రారంభం కానున్నాయి. జూనియర్ కాలేజీల పునఃప్రారంభ తేదీ: జూన్ 1గా నిర్ణయించారు. దసరా సెలవులు అక్టోబర్ 10 నుంచి 13 వరకు ఉంటాయి. ఆసరా అనంతరం అక్టోబర్ 13 నుంచి తరగతులు ప్రారంభం అవుతాయి. హాఫ్ ఇయర్ పరీక్షలు: నవంబర్ 18 నుంచి 23 వరకు జరుగుతాయి. సంక్రాంతి సెలవులు జనవరి 11, 2025 నుంచి జనవరి 16 వరకు ఇస్తారు. సంక్రాంతి సెలవుల అనంతరం జనవరి 17 నుంచి తరగతులు ప్రారంభం అవుతాయి. ప్రీ ఫైనల్ పరీక్షలు వచ్చే జనవరి 20 నుంచి 25 వరకు కొనసాగుతాయి. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి మొదటి వారంలో, థియరీ పరీక్షలు మార్చి మొదటి వారంలో ప్రారంభం అవుతాయి. 2024-25 విద్యా సంవత్సరానికి చివరి పని దినం మార్చి 29గా నిర్ణయించారు. వేసవి సెలవులు మార్చి 30 నుంచి జూన్ 1, 2025 వరకు కొనసాగుతాయి. ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు మే చివరి వారంలో ఉంటాయి.

## వేలాదిమంది బలిదానాలకు

# కాంగ్రెస్సే కారణం

**- సోనియా ముమ్మాటికీ బలిదేవత అన్న కెటిఆర్**

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-మే31:**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ట్విటర్ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని టార్గెట్ చేశారు. తెలంగాణలో వేలాది మంది అమరులు అయ్యింది ఎవరి వల్ల? అమరులస్తూపం నిర్మించాల్సి వచ్చింది ఎవరివల్ల? 1952 లోనే ఉమ్మడి రాష్ట్రం వద్దని, హైదరాబాద్ స్టేట్ ప్రత్యేక రాష్ట్రంగానే ఉండాలని పోరాటం చేస్తున్న విద్యార్థులపై సిటీ కాలేజీ వద్ద కాల్పులు జరిపి ఆరుగురిని బలిగొన్నది ఎవరు? కాంగ్రెస్ ప్రభుత్వం కాదా? 1969-71 తొలిదశ ఉద్యమంలో 370 మంది తెలంగాణ బిడ్డల్ని కాల్చి చంపింది ఎవరు? కాంగ్రెస్ ప్రభుత్వం' అని పేర్కొన్నారు. 1971 పార్లమెంట్ ఎన్నికల్లో 11 సీట్లలో తెలంగాణ ప్రజాసమితి పార్టీని గెలిపిస్తే ఆ పార్టీని మాయం చేసింది కూడా కాంగ్రెస్ ప్రభుత్వమేనని కేటీఆర్ అన్నారు. దేశంలో ఎక్కడలేని విధంగా ప్రజాస్వామికంగా, తమ ఆకాంక్షను వ్యక్తం చేస్తే, తెలంగాణను తుంగలో తొక్కింది కూడా కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. 2004లో మాట ఇచ్చి, పదేళ్ల తాత్సారం చేసి వందలాది తెలంగాణ బిడ్డలు ఆత్మ బలిదానం చేసుకునే దుస్థితికి కారణం కూడా కాంగ్రెస్ ప్రభుత్వమేనని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా చెప్పినట్టు, వేలాది తెలంగాణ బిడ్డలను చంపిన బలిదేవత ఎవరని కేటీఆర్ ప్రశ్నించారు.

# రూ.2,000 కోట్లు అప్పు తీసుకోనున్న రాష్ట్రం

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్, మే 31:**

రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.2,000 కోట్లు అప్పు తీసుకోనుంది. ఈ మేరకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు శుక్రవారం ఇండెంట్ పెట్టింది. 16 ఏళ్ల కాల పరిమితితో రూ.1,000 కోట్లు, 19 ఏళ్ల కాల పరిమితితో మరో రూ.1,000 కోట్లను రుణంగా తీసుకోనుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూ.4,000 కోట్ల అప్పు కోసం ఇండెంట్ పెట్టింది. తెలుగు రాష్ట్రాలు సహా దేశంలోని 11 రాష్ట్రాలు రూ.19,500 కోట్ల అప్పుల కోసం ఆర్‌బీఐని ఆశ్రయించాయి. జూన్ 4న జరిగే ఈ-వేలం ద్వారా ఈ అప్పులు తీసుకోనున్నాయి.

# ఆస్పత్రులను నిర్లక్ష్యం చేస్తున్న కాంగ్రెస్

**- క్యాంటీన్ బిల్లులు 20 కోట్ల వరకు చెల్లించాలి**

**- మాజీమంత్రి హరీష్ రావు డిమాండ్**

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-మే31:**

ప్రభుత్వ ఆస్పత్రులను కాంగ్రెస్ నిర్లక్ష్యం చేస్తోందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఆస్పత్రి క్యాంటీన్లకు బిల్లులను చెల్లించకుండా పెండింగ్‌లో ఉంచిందని తెలిపారు. రూ.20 కోట్ల బిల్లులు చెల్లించకపోవడంతో రోగులు, వైద్యులు అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. తెలంగాణలోని ప్రభుత్వ దవాఖానాల్లో రోగులు, డ్యూటీ డాక్టర్లకు ఆహారం సరఫరా చేస్తున్న డైట్ క్యాంటీన్లకు రాష్ట్ర ప్రభుత్వం కొద్దిరోజులుగా బిల్లులు చెల్లించడం లేదు. దీంతో డైట్ క్యాంటీన్ సప్లై చేస్తున్న వారి బకాయిలు రూ.20 కోట్లకు చేరుకుంది. కొంతకాలంగా బిల్లులు రాకపోవడంతో పాటు సరుకుల ధరలు పెరగడంతో క్యాంటీన్లకు ఆహారం సరఫరా చేయడం తమకు ఇబ్బంది కలుగుతుందని గాంధీ, ఉస్మానియా, పెట్లబుర్జు, సంగారెడ్డి, వరంగల్ ఎంజీఎం ఆస్పత్రులకు ఆహారం సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా, డీఎంఈ డాక్టర్ ఎన్.వాణి, వైద్య శాఖ కమిషనర్‌ను గురువారం కలిసి వినతి పత్రాలు అందజేశారు. ఈ క్రమంలోనే మాజీ మంత్రి హరీశ్‌రావు ట్విట్టర్ (ఎక్స్ ) వేదికగా స్పందించారు. రాష్ట్ర ప్రభుత్వమే తక్షణమే స్పందించి పెండింగ్ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు క్యాంటీన్ కాంట్రాక్టర్లు పడుతున్న ఇబ్బందులకు సంబంధించి టైమ్స్ న్యూస్ నెట్‌వర్క్‌లో ప్రచురితమైన ఒక వార్తకు సంబంధించిన స్క్రీన్‌షాట్‌ను షేర్ చేశారు.

# గ్రూప్-1 ప్రిలిమ్స్ వాయిదా వేయండి

**- అదే రోజు ఐబి పరీక్ష ఉందన్న ప్రవీణ్ కుమార్**

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-మే31:**

జూన్ 9న జరుగబోయే గ్రూప్-1 ప్రిలిమ్స్‌ను వాయిదా వేయాలని బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. అదే రోజున ఇంటెలిజెన్స్ బ్యూరో పరీక్ష కూడా ఉందన్నారు. చాలా మంది నిరుద్యోగులు ఐబీ పరీక్ష రాస్తారని, ఎన్నికల వల్ల ప్రభుత్వ ఉద్యోగులు గ్రూప్-1 సన్నద్ధం కాలేదన్నారు. ఈ నేపథ్యంలో పరీక్ష వాయిదా వేసి నెల రోజులు సమయం ఇస్తే బాగా ప్రిపేర్ అవుతారని చెప్పారు.కాగా, గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను జూన్ 9వ తేదీ నే నిర్వహించడానికి టీజీపీఎస్సీ ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నది. జూన్ ఒకటో తేదీ మధ్యాహ్నం నుంచి హాల్ టికెట్లు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని, అభ్యర్థులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని టీజీపీఎస్సీపేర్కొంది. జూన్ 9న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష జరగనున్న విషయం తెలిసిందే. పరీక్ష కోసం తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ అన్ని ఏర్పాట్లు చేస్తున్నది. రాష్ట్రంలోని 563 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఫిబ్రవరి 23 నుంచి మార్చి 16 వరకు దరఖాస్తులు స్వీకరించారు. జూన్ 9న ప్రిలిమ్స్ పరీక్షను నిర్వహిస్తున్నది. జూన్ ఒకటి నుంచి టీజీపీఎస్సీ అధికారిక వెబ్‌సైట్ లో హాల్ టికెట్లు అందుబాటులో ఉంటాయని పేర్కొంది. అక్టోబర్ 21 నుంచి మెయిన్స్ పరీక్షలను నిర్వహించనున్నది.

# జబర్దస్త్ ఫేమ్ రాకింగ్ రాకేశ్ కెసిఆర్ చిత్రం

**- పాటను ఆవిష్కరించిన బిఆర్ఎస్ అధినేత కెసిఆర్**

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-మే31:**

జబర్దస్త్ ఫేమ్, నటుడు రాకింగ్ రాకేశ్ హీరోగా తెరకెక్కిన కేసీఆర్ ( కేశవ చంద్ర రమావత్ ) సినిమాలోని తెలంగాణ తేజం పాటను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆవిష్కరించారు. హైదరాబాద్ నందినగర్‌లోని కేసీఆర్ నివాసానికి సినిమా హీరో, నిర్మాత రాకింగ్ రాకేశ్ శుక్రవారం వెళ్లి ఆయన్ను కలుసుకున్నారు. రాకింగ్ రాకేశ్‌తోపాటు, మ్యూజిక్ డైరెక్టర్ చరణ్ అర్జున్, జోర్దార్ సుజాత, సింగర్లు విహ, గీత, రచయిత సంజయ్ మహేశ్‌లు కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా తెలుగు తేజం పాటను కేసీఆర్ ఆవిష్కరించారు.

## 7, 8 తేదీల్లో హైదరాబాద్‌లో

# ప్రపంచ వరి సదస్సు

(మొదటి పేజీ తరువాయి..)

పంటల సంస్థ (కాలిఫోర్నియా, అమెరికా) డైరెక్టర్ మెర్సిడెజ్ జోన్స్‌తో పాటు స్థానిక నిర్వహకులు ప్రొఫెసర్ అల్దాస్ జానయ్యలు శుక్రవారం వివరించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ.. ఈ సదస్సుకు దాదాపు 150 మంది విదేశీ వరి ధాన్యం ఎగుమతిదారులు, దిగుమతిదారులతో పాటు అంతర్జాతీయ వరి పరిశోధన సంస్థ(ఫిలిప్పీన్స్) నుండి ప్రముఖ వరి శాస్త్రవేత్తలు రానున్నారని తెలిపారు. అలాగే ఇతర రాష్ట్రాల నుండి 150 మంది వరి ఎగుమతిదారులు, వరి విత్తన కంపెనీల ప్రతినిధులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు వస్తారని, రాష్ట్రంలోని 30 మంది అభ్యుదయ రైతులు, 30 మంది రైస్ మిల్లర్లు కూడా పాల్గొంటారని తెలిపారు. దేశీయ వరి ఎగుమతిదారులు, విదేశీ దిగుమతి దారులతో నేరుగా సంప్రదింపులు చేసుకునే అవకాశం ఉంటుందని, శాస్త్రవేత్తల ద్వారా విత్తనోత్పత్తిలో అందుబాటులో ఉన్న అధునాతన పరిజ్ఞానాన్ని తెలుసుకునే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. కాగా, విత్తనాల సరఫరాపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం ఆరాతీశారు. సెక్రటేరియట్ నుంచి ఆదిలాబాద్, రంగారెడ్డి జిల్లాల కలెక్టర్లతో ఫోన్‌లో మాట్లాడారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు.

## హామీలన్నీ నెరవేర్చే

# బాధ్యత నాదే

(మొదటి పేజీ తరువాయి..)

తెలంగాణాలో మార్పు కావాలని ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకున్నామని, ఇళ్ళు లేని ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్ళు ఇస్తామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.పాఠశాల, రోడ్లు, కమ్యూనిటీ హాల్ నిర్మాణం త్వరలోనే పూర్తి చేపిస్తామన్నారు. త్వరలోనే అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు, పెన్షన్లు ఇస్తామన్నారు. పాలేరు నియోజకవర్గం తన సొంత ఇల్లు అని, ఎన్నికల కోడ్ అయిపోగానే నియోజకవర్గంలో అభివృద్ధి పనులు మొదలవుతాయన్నారు. అడిగిన సమస్యలే కాకుండా అడగని సమస్యలు కూడా పరిష్కరిస్తాని చెప్పారు. ప్రజలు అడిగిన కోరికలు తీర్చే బాధ్యత తనదన్నారు. భవిష్యత్‌లో ఏ సమస్య వచ్చినా ఇందిరమ్మ కమిటీ ద్వారా తనకు తెలియచేయాలని, ప్రజలందరూ సంతోషంగా ఉండాలని మీ పెద్ద కొడుకుగా పనిచేస్తానని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సాగర్లేఓ నీరు లేకున్నా పాలేరు రిజర్వాయర్ ద్వారా అందించే ప్రయత్నం చేస్తానని అన్నారు.

# నేడు చివరిదశ లోక్‌సభ ఎన్నికలు

(మొదటి పేజీ తరువాయి..)

పంజాబ్‌లోని మొత్తం 13 స్థానాలకు, హిమాచల్ ప్రదేశ్ లో నాలుగు స్థానాలకు, ఉత్తర్ ప్రదేశ్ లోని 13 నియోజకవర్గాలకు, పశ్చిమ బెంగాల్ లోని తొమ్మిది స్థానాలకు, బీహార్ లోని ఎనిమిది స్థానాలకు, ఒడిశాలోని ఆరు స్థానాలకు, ఝార్ఖండ్‌లోని 3 సీట్లకు ఎన్నికలు జరగనున్నాయి. ఈసారి పోటీలో ఉన్న ప్రముఖులలో కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకుర్, మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీ, లాలూ ప్రసాద్ కూతురు మిసా భారతి, నటి కంగనా రనౌత్ ఉన్నారు. ఓట్ల లెక్కింపు జూన్ 4న జరుగనున్నది. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం టెలివిజన్ ఛానల్స్, వార్తా సంస్థలు జూన్ 1న సా.6.30 తర్వాత ఎగ్జిట్ పోల్ డేటాను ప్రదర్శించుకోవచ్చు. దీంతో ఇప్పటికే డేటాతో సిద్ధంగా ఉన్న పలు సంస్థలు తమ ఎగ్జిట్ పోల్స్‌ను ప్రదర్శించేందుకు సిద్ధంగా ఉన్నాయి.

# ఇంగ్లండ్ నుంచి లక్ష కిలోల బంగారం!

(మొదటి పేజీ తరువాయి..)

విదేశీ మారక నిల్వల పరంగా నెలకొన్న సంక్షోభం కారణంగా మనదేశం 1991లో ఆర్బీఐ పెద్ద ఎత్తున బంగారాన్ని తనఖా పెట్టాల్సి వచ్చింది. దీన్నే ఆర్బీఐ వర్గాలు గుర్తుచేస్తూ.. "ఆర్థికంగా భారత దేశ సామర్థ్యం, విశ్వాసం ఏ స్థాయిలో ఉందనేది స్వదేశీ ఖజానాకు ఇంత పెద్దఎత్తున బంగారాన్ని చేర్చడమే చాటుతోంది" అని వ్యాఖ్యానించాయి. "కొన్నిఏళ్ల క్రితం నుంచి ఆర్బీఐ బంగారాన్ని కొనడం మొదలు పెట్టింది. దీన్ని ఎక్కడ నిల్వ చేయాలనే దానిపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ వచ్చింది. విదేశాల్లో నిల్వలు పెరిగిపోవడంతో సర్దుబాట్లలో భాగంగా కొన్ని నిల్వలలను భారత్‌కు తరలించాలని నిర్ణయించాం" అని ఆ వర్గాలు పేర్కొన్నాయి.



# పవన్ కాల్‌షీట్ల కోసం ఎదురుచూపు

## హరిహరవీరమల్లు షూటింగ్ పూర్తికి కసరత్తు







టాలీవుడ్ స్టార్ యాక్టర్ పవన్ కల్యాణ్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలు లైన్‌లో పెట్టాడని తెలిసిందే. పవన్ కల్యాణ్ టైటిల్ రోల్ పోషిస్తున్న సినిమాల్లో ఒకటి హరిహర వీరమల్లు . పీరియాడిక్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి క్రిష్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇస్మార్ట్ బ్యూటీ నిధి అగర్వాల్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. కాగా ఈ చిత్రం బ్లాక్ బస్టర్ హిట్ పక్కా అని ఇప్పటికే నిర్మాత ఏఎం రత్నం చేసిన కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఇటీవలే ఏపీ ఎన్నికల షెడ్యూల్ ముగియడంతో పవన్ కల్యాణ్ ఎప్పుడెప్పుడు షూటింగ్ అప్‌డేట్ ఇస్తాడా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు అభిమానులు. వారి కోసం నెట్టింట ఇంట్రెస్టింగ్ న్యూస్ హల్ చల్ చేస్తోంది. తాజా టాక్ ప్రకారం ఈ మూవీ షూటింగ్‌ను జూన్ 15 నుంచి షురూ చేయాలని ప్లాన్ చేస్తున్నారు. పవన్ కల్యాణ్ షూటింగ్ మొదలైన వారం తర్వాత చిత్రీకరణలో పాల్గొనబోతున్నాడని సమాచారం. ఈ సినిమాను సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో రిలీజ్ చేసేందుకు రెడీ అవుతున్నారు మేకర్స్. ఈ చిత్రంలో బాలీవుడ్ యాక్టర్లు అర్జున్ రాంపాల్, నర్గీస్ ఫక్రీ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి ఈ మూవీకి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఇప్పటికే లాంఛ్ చేసిన హరిహరవీరమల్లు పోస్టర్లు, గ్లింప్స్ వీడియోలు సినిమాపై అంచనాలు అమాంతం పెంచుతున్నాయి. ఈ మూవీ రెండు పార్టులుగా రానుండగా.. ఏఎం రత్నం సమర్పణలో మెగా సూర్య ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఏ దయాకర్ రావు నిర్మిస్తున్నారు. కొన్ని రోజుల క్రితం హరిహరవీరమల్లు అండ్ టీంపై వచ్చే హై ఆక్టేన్ యాక్షన్ సీన్లను ఇప్పటికే రామోజీఫిలింసిటీలో చిత్రీకరించారు. పవన్ కల్యాణ్ మరోవైపు ఓజీ, ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాల్లో కూడా నటిస్తున్నాడు.

# తండ్రిని తలచుకుంటూ..

## మహేష్ ఎమోషనల్ పోస్ట్



తెలుగు చిత్ర పరిశ్రమ స్థాయిని పెంచిన నటుడు కృష్ణ. అర్ధ శతాబ్దం పాటు తన సత్తా చాటిన ఈ లెజెండరీ నటుడి జయంతి నేడు. ఈ సందర్భంగా సోషల్ మీడియా వేదికగా సెలబ్రిటీలు, అభిమానులు ఆయన్ని గుర్తు చేసుకుంటూ పోస్టులు పెడుతున్నారు. ఇక తన తండ్రిని తలచుకుంటూ మహేశ్ బాబు ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. 'పుట్టినరోజు శుభాకాంక్షలు నాన్న. మిమ్మల్ని ప్రతి క్షణం మిస్ అవుతున్నాను. నా ప్రతి జ్ఞాపకంలోనూ మీరు ఎప్పటికీ జీవించే ఉంటారు' అంటూ కృష్ణ యంగ్ లుక్‌లో ఉన్నప్పటి ఫొటోను మహేశ్‌బాబు పంచుకున్నారు. హీరో సుధీర్ బాబు కూడా కృష్ణను తలచుకుంటూ పోస్ట్ పెట్టారు. 'హ్యాపీ బర్త్‌డే మామయ్య. మీ పక్కన కూర్చొని 'హరోం హర' చూడాలనుంది. నేను ఇలాంటి యాక్షన్ సినిమాలో నటించాలని మీరు ఎప్పుడూ ప్రోత్సహించేవారు. ఈ సినిమా మీకోసమే చేశాను. మీరు గర్వపడేలా చేస్తానని హామీ ఇస్తున్నాను' అని రాసుకొచ్చారు. అశోక్ గల్లా కథానాయకుడిగా రూపొందుతోన్న చిత్రం 'దేవకీ నందన వాసుదేవ'. ఈ సినిమాలోని రెండో పాటను కృష్ణ జయంతి సందర్భంగా విడుదల చేశారు. 'జై బోలో కృష్ణ' అంటూ సాగే ఈ పాటను ఆయనకు అంకితం చేస్తున్నట్లు తెలిపారు.

# దేవకీ నందన వాసుదేవ నుంచి సాంగ్ రిలీజ్..




టాలీవుడ్ యాక్టర్ అశోక్ గల్లా కాంపౌండ్ నుంచి వస్తున్న సినిమా దేవకీ నందన వాసుదేవ. గుణ 369 ఫేం అర్జున్ జంధ్యాల డైరెక్ట్ చేస్తున్నాడు. 2 ప్రాజెక్టుగా వస్తోన్న ఈ మూవీ నుంచి ముందుగా అందించిన అప్‌డేట్ ప్రకారం సెకండ్ సింగిల్ జై బోలో కృష్ణ సాంగ్ లాంఛ్ చేశారు. రఘురామ్ రాసిన ఈ పాటను భీమ్స్ సిసిరోలియో కంపోజిషన్‌లో స్వరాగ్ కీర్తన్ పాడాడు. ఈ మూవీకి జాంబిరెడ్డి ఫేం ప్రశాంత్ వర్మ కథనందిస్తున్నాడు. మేకర్స్ ఫస్ట్ యాక్షన్ వీడియోలో.. బురదలో జరిగ్గ÷ట్ సన్నివేశంతో కట్ చేసిన ఫస్ట్ యాక్షన్ సీక్వెన్స్ ఇప్పటికే సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తూ.. సూపర్ బజ్ క్రియేట్ చేస్తోంది. యూనిక్ కథాంశంతో తెరకెక్కుతున్న ఈ సినిమాలో అశోక్ గల్లా మాస్ అవతార్‌లో కనిపించబోతున్నట్టు డైరెక్టర్ టీజర్‌తో క్లారిటీ ఇచ్చేశాడు. ఈ మూవీని నల్లపనేని యామిని సమర్పణలో లలితాంబికా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సోమినేని బాలకృష్ణ తెరకెక్కిస్తున్నారు. సాయి మాధవ్ బుర్రా సంభాషణలు అందిస్తున్నాడు. భీమ్స్ సిసిరోలియో మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. నీ బిడ్డకు మరణగండం.. లేదా అతని చేతిలో మరొకరికి మరణం అనే డైలాగ్స్‌తో సాగే టీజర్ సినిమాపై ఇప్పటికే క్యూరియాసిటీ పెంచుతోంది.

# తమిళంలో బిజీగా కీర్తిసురేష్



సౌత్ ఇండియా స్టార్ హీరోయిన్ కీర్తి సురేష్ గురించి ప్రత్యేకంగా సినీ ప్రేమికులకు పరిచయం చేయాల్సిన అవసరం లేదు. నేను శైలజతో తెలుగు ఇండస్ట్రీలోకికి ఎంట్రీ ఇచ్చి అనతికాలంలోనే స్టార్ హీరోయిన్‌గా పేరు తెచ్చుకుంది. ఇక గత ఏడాది దసరా సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న ఈ భామ ప్రస్తుతం తెలుగు సినిమాలకు బ్రేక్ ఇచ్చేసి వరుసగా తమిళంతో పాటు బాలీవుడ్ సినిమాలు చేస్తుంది. ఇప్పటికే హిందీ నటుడు వరుణ్ ధావన్‌తో ఒక సినిమా చేస్తున్న ఈ భామ తాజాగా 'రఘు తాతా' అంటూ ప్రేక్షకుల ముందుకు వస్తుంది. ఈ సినిమాకు సుమన్‌కుమార్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ మూవీ నుంచి రీసెంట్‌గా టీజర్ విడుదల చేయగా.. ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇదిలావుంటే తాజాగా మూవీ విడుదల తేదీని అనౌన్స్ చేశారు మేకర్స్. ఈ సినిమాను స్వాతంత్య్ర దినోత్సవం కానుకగా ఆగష్టు 15న విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. అయితే అదే రోజు తెలుగులో అల్లు అర్జున్ పుష్ప విడుదల కానుంది. దీంతో ఆగష్ట్ 15న రెండు పెద్ద సినిమాలు పోటి పడనున్నట్లు తెలుస్తుంది. ఇక రఘు తాతా టీజర్ చూస్తే.. నేషనల్ క్యాడెట్ కార్ప్స్ లో క్యాడెట్ శిక్షణ పొందుతున్న కీర్తి సురేష్ పాత్రతో టీజర్ ప్రారంభమవుతుంది. అయితే ఔఅఅ మాస్టర్ హిందీలో శిక్షణ ఇస్తుండగా.. నాకు హిందీ రాదు తమిళంలో చెప్పండి సార్ అంటూ కీర్తి సురేష్ చెబుతుంది. దీంతో ఈ చిత్రం తమిళ ప్రజలపై హిందీని రుద్దడం చుట్టూ తిరుగుతున్నట్లు తెలుస్తుంది. ఒక సన్నివేశంలో హిందీ పరీక్ష రాస్తేనే ఉద్యోగంలో ప్రమోషన్ వస్తుంది అంటే దానిని కీర్తి సురేష్ తిరస్కరించడం చూడవచ్చు. 'సలార్' తో సక్సెస్ అందుకున్న హోంబలే ఫిల్మ్స్ బ్యానర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా.. ఎంఎస్ భాస్కర్, రవీంద్ర విజయ్, దేవదర్శిని, రాజీవ్ తదితరులు ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. షాన్ రోల్డన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నాడు.

